క్లుప్తంగా

నేడు ఎం.కొత్తపల్లిలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్

రొద్దం: మండల పరిధిలోని ఎం కొత్తపల్లి గ్రామ పంచాయతీలో నేడు గురువారం కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ బి.తిమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

పెనుకొండ రూరల్: ఓటరు జాబితా అంశాలపై బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

పట్టుగూళ్ల కేంద్రం అధికారి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన హంపయ్య

హిందూపురం: పట్టణంలోని పట్టుగూళ్ల విక్రయ కేంద్రం నిర్వాహణ అధికారిగా హంపయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మిరెడ్డిని కడపకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో హిందూపురం విక్రయ కేంద్రం అధికారిగా కుప్పం నుంచి హంపయ్యను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం హంపయ్య మాట్లాడారు. హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ నిర్వాహణతో పాటు రీలర్లు, రైతులకు అందుబాటులో ఉంటానన్నారు. అలాగే మార్కెట్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు.

వ్యక్తి బైండోవర్

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లికి చెందిన వినోద్‌ను తహసీల్దార్ శ్రీధర్ ముందు హాజరు పర్చినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. వేటకొడవళితో గ్రామంలో సంచరిస్తుండటంతో గ్రామస్తులు సమాచారం ఇచ్చారన్నారు. ఇందులో భాగంగానే వినోద్‌ను బైండోవర్ చేశామన్నారు.

శ్మశాన వాటికకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న వీఆర్వో తదితరులు

అమరాపురం: మండల పరిధిలోని వి.అగ్రహారం గ్రామంలో బుధవారం శ్మశాన వాటిక ఏర్పాటుకు స్థలాన్ని వీఆర్వో రవి ఆధ్వర్యంలో గ్రామస్తులు పరిశీలించారు. గ్రామంలో శ్మశాన వాటిక లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇదే విషయాన్ని తహసీల్దార్, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు విన్నవించారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో గ్రామ ప్రజలతో కలసి సర్వే నంబర్ 360 - 3బీలో ఉన్న 3.25 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఈ స్థలం శ్మశాన వాటికకు అనువైనదిగా వీఆర్వో తెలియజేయడంతో ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని వీఆర్వో తెలిపారు.

108లో ప్రసవం

హిందూపురం టౌన్: చిలమత్తూరు మండల పరిధిలోని చాగలేరుకు చెందిన ఊర్మిల అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్సులోనే సుఖప్రసవమైంది. బుధవారం ఆమెను హిందూపురం ప్రభుత్వాస్పత్రికి ప్రసవం నిమిత్తం తరలిస్తుండగా, మార్గమధ్యంలో నొప్పులు అధికం కావడంతో 108 అంబులెన్స్ సిబ్బంది లేపాక్షి మండలం బిసలమానేపల్లి సమీపంలో అంబులెన్సులోనే సుఖప్రసవం చేశారు. ఊర్మిల మగబిడ్డకు జన్మనివ్వగా.. హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు ప్రైవేటు బస్సులు, లారీ సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ ఉదయకుమార్

అగళి: మండల కేంద్రమైన అగళిలో బుధవారం ఎంవీఐ ఉదయకుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని రెండు ప్రైవేట్ బస్సులు, లారీని సీజ్ చేశారు. ఎంవీఐ మాట్లాడుతూ సరైన పత్రాలు, ఫిట్‌నెస్ లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. పన్నులు చెల్లించకుండా రహదారులపైకి వస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీగా జరిమానా వేస్తామన్నారు. ఏఎస్‌ఐ శ్రీరాములు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్లకు రాం రాం !

- ఆర్టీసీ బస్సుల్లో అలంకార ప్రాయంగా ప్రథమ చికిత్స బాక్సులు
- అమలు కాని మోటారు వాహన చట్టం
- ప్రయాణికుల ఆరోగ్యం పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

హిందూపురం: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం, సుఖవంతం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సు (ఫస్ట్ ఎయిడ్ బాక్స్)లు అలంకార ప్రాయంగా మారాయి. బస్సు ప్రమాదానికి గురైనా, ప్రయాణికులకు ఏదైనా ప్రమాదం జరిగినా అప్పటికప్పుడు తాత్కాలిక వైద్యసేవలు అందించేందుకు ప్రతి ఆర్టీసీ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉంచాలి. అందులో అత్యవసర మందులు, కట్టుకట్టే కాటన్, కత్తెర ఇలా ఒక కిట్ తప్పని సరిగా ఉందుబాటులో ఉండాలి. అయితే ప్రస్తుతం ఏ ఆర్టీసీ బస్సులోనూ ఫస్ట్ ఎయిడ్ కిట్ బాక్సుల్లో ఇవేమీ కనిపించడం లేదు. ప్రయాణికుల భద్రతపై ఆర్టీసీ సంస్థకు, ప్రభుత్వానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తోందో అర్థమవుతోంది. ప్రభుత్వం ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో మందుల కొనుగోలుకు నిధులు మంజూరు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రయాణంలో చిన్నపాటి గాయాలైనా ప్రయాణికులు దగ్గరలో ఉన్న ఆస్పత్రికెళ్లి చికిత్స చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.



హిందూపురం ఆర్టీసీ డిపో బస్సులో ఖాళీగా ఉన్న ఫస్ట్ ఎయిడ్ బాక్స్



ఫస్ట్ ఎయిడ్ బాక్స్ పగిలిపోయి ఖాళీగా కనిపిస్తున్న దృశ్యం

చట్టానికి తూట్లు

కేంద్ర మోటారు వాహన చట్టం 1939 ప్రకారం ప్రయాణికుల వాహనాల్లో తప్పనిసరిగా ప్రథమ చికిత్స బాక్సులు ఏర్పాటు చేసి వాటిలో అత్యవసర మందులు, చికిత్సలకు అందించే వస్తువులు ఉంచాలి. ఈ చట్టాన్ని మరింత పటిష్టం చేస్తూ 1988లో మరిన్ని సవరణలు చేశారు. నిబంధనల ప్రకారం ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఇతర అవసరమైన వస్తువులను ప్రథమ చికిత్స బాక్సుల్లో ఉంచాలి. లైసెన్స్ పొందే ముందు బస్ డ్రైవర్, కండక్టర్ వారం రోజులపాటు ప్రథమ చికిత్స అందించడంపై తప్పనిసరిగా శిక్షణ పొంది ఉండాలి. ప్రతి మూడేళ్లకు ఒకసారి లైసెన్స్ పునరుద్ధరించుకోవాలని చట్టం చెబుతోంది. ప్రయాణికులు గాయపడితే వారికి ప్రథమ చికిత్స చేసే సామర్థ్యం బస్సు డ్రైవర్, కండక్టర్లకు ఉంటుంది. రవాణాశాఖ అధికారుల నుంచి బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందే సమయంలో మాత్రమే మొక్కుబడిగా ప్రథమ చికిత్సలు బాక్సులు చూపుతున్నారే తప్ప తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉంటున్నాయి.

మందులు అందుబాటులో ఉంచుతాం



ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సుల్లో అవసరమైన మందులు ఉండేలా డ్రైవర్లు, కండక్టర్లకు సూచనలిస్తున్నాం. ఫస్ట్ ఎయిడ్ బాక్సులకు తాళాలు వేసి అత్యవసర సమయాల్లో తెరచి చికిత్స చేయాల్సి ఉంటుంది.

– శ్రీకాంత్, ఆర్టీసీ డిపో మేనేజర్, హిందూపురం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

హిందూపురం: ప్రతిరోజూ యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఉషోదయ బాలాజీ విద్యాలయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం రవీంద్రారెడ్డి తెలిపారు. యోగా వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆ స్కూల్‌లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఇందులో భాగంగానే యోగా వలన కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఏఓ అరుణకుమారి, ఉపాధ్యాయులు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వీరభద్రస్వామి హుండీ కానుకల లెక్కింపు

లేపాక్షి: మండల కేంద్రంలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి హుండీ తెరచి లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజాభిమానాన్ని అడ్డుకోవడం సిగ్గుచేటు

- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక ధ్వజం



చిలమత్తూరు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్తెనపల్లి పర్యటన నేపథ్యంలో ప్రభుత్వం ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రజల మనిషి అని, ఆయన జనంలోకి వస్తే అభిమానం వెల్లువలా పొంగుతుందన్నారు. అలాంటి అభిమానాన్ని కూటమి ప్రభుత్వం పోలీసుల ద్వారా అణచివేసేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు కార్యక్రమాలకు ఎన్నడూ అప్పటి సీఎం జగన్ అడ్డు చెప్పలేదన్నారు. ప్రజలు, అభిమానులను రాకూడదని ఆంక్షలు పెట్టినా కొండంత అభిమానం ఆయనను చూసేందుకు ఎగబడిందన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని చూస్తే చంద్రబాబు వెన్నులో వణుకు పుడుతోందన్నారు. అందుకే ఎప్పుడు చూసినా ఆయనపై విమర్శలు చేయడం, అవమానించడం వంటివి చేయిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇస్తే ఎక్కడ నిలదీస్తారో అని భయపడి ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని, ప్రజాక్షేత్రంలోకి వచ్చి ప్రశ్నిస్తున్నా అడ్డుకోవడం చూస్తుంటే చంద్రబాబు పాలనా వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందన్నారు.

చెవిరెడ్డి అరెస్ట్ అక్రమం

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. లిక్కర్ కేసు బాబు సృష్టి అని, వైఎస్సార్‌సీపీ కీలక నేతలను వేధించి కక్ష తీర్చుకోవడానికే అరెస్టులని మండిపడ్డారు. ఓ కానిస్టేబుల్‌పై అమానుషంగా ప్రవర్తించి దాడి చేసి తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించే ప్రయత్నాలు చేయడంపై కానిస్టేబుల్ విడుదల చేసిన లేఖ చూస్తుంటే ఈ రాష్ట్రం ఎటుపోతోందో అర్థం కావడం లేదన్నారు.

‘సంక్షేమం’ అమలులో కూటమి విఫలం

పెనుకొండ రూరల్: సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద వెన్నుపోటు పుస్తకావిష్కరణ చేశారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెన్ను పోటు పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొగాకు రామచంద్ర మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనలో ప్రజలు వెన్నుపోటుకు గురయ్యారన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఫించన్లు మాత్రమే అమలు చేస్తే సరిపోదన్నారు. పూర్తిస్థాయిలో తల్లికి వందనంతో పాటు సూపర్ సిక్స్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్లు నాగళూరు బాబు, శ్రీకాంత్‌రెడ్డి, మావటూరు సర్పంచ్ నాగరాజు, కౌన్సిలర్లు శేషాద్రి, సద్దాం, నాయకులు గణప్ప, బాబు, శ్రీరాములు, యాసిన్, కిరణ్, కిష్టప్ప, కొండలరాయుడు, చెన్నకేశవులు, మల్లిరెడ్డి, నారాయణ, వెంకటరామిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండ: ‘వెన్నుపోటు’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



గోరంట్ల: వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి క్రాస్ వద్ద మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద వెన్నుపోటు పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతలు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండల కన్వీనర్ వెంకటేష్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో జరుగుతున్న మోసాలు, అరాచకాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ కన్వీనర్ మేదర శంకర్, జిల్లా ట్రెజరర్ బలన్నగారిపల్లి రామకృష్ణారెడ్డి, బూదిలి మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వాసునాయక్, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూములివ్వండి



మాట్లాడుతున్న కలెక్టర్ శుభ కళ్యాణ్

పావగడ: తిరుమణి సోలార్ పార్క్ నుంచి ఉత్పత్తయ్యే సుమారు 2 వేల మెగావాట్ల సౌర విద్యుత్ సబ్‌స్టేషన్‌ను హుస్సేన్‌పురం గ్రామంలో ఏర్పాటు చేయడానికి నిర్ణయించాము. సబ్ స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన సుమారు 150 ఎకరాల భూమిని ఇవ్వాలని తాలూకాలోని హుస్సేన్ పురం గ్రామ రైతులను తుమకూరు జిల్లా కలెక్టర్ శుభ కళ్యాణ్ కోరారు. హుస్సేన్ పురం గ్రామంలో బుధవారం రైతు సభ నిర్వహించారు. విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు 150 ఎకరాల భూమిని అందించడానికి రైతులు సిద్ధంగా ఉన్నా ధరల విషయంలో తేడా వచ్చినట్లు పలువురు రైతులు తెలిపారు. మార్కెట్ ధరకు అనుగుణంగా ఎకరాకు రూ.30 లక్షలు రైతులు డిమాండ్ చేశారు. అయితే కలెక్టర్ మాత్రం ప్రభుత్వ ధరల ప్రకారం ఎకరాకు సుమారు రూ.20 లక్షలు చెల్లిస్తామని చెప్పినట్లు తెలిసింది. ఇదే విషయం స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ సైతం రైతులతో మాట్లాడినట్లు సమాచారం.

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం



మాట్లాడుతున్న చౌళూరు మధుమతిరెడ్డి

చిలమత్తూరు: సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలాకాలో భర్త అప్పు తీర్చలేదన్న కారణంతో మహిళను చెట్టుకు కట్టేసి చిత్రహింసలకు గురిచేయడం చంద్రబాబు రాచరిక పాలనకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కుప్పం నియోజకవర్గంలోని నారాయణపురంలో శిరీష అనే మహిళపై టీడీపీ కార్యకర్త చేసిన దుర్మార్గమైన చర్య చాలా హీనమైనదన్నారు. రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట మహిళలపై అకృత్యం జరుగుతూనే ఉందన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం అయిపోయిందన్నారు. కుప్పం బాధిత మహిళను హోంమంత్రి అనిత ఫోన్ ద్వారా పరామర్శించడం ఆమె నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టు అక్రమమన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నియోజకవర్గ అధ్యక్షురాలు కవితారెడ్డి, ఎంపీపీ రత్నమ్మ, సహేరాభాను తదితరులు పాల్గొన్నారు.

పదవులు పొందిన వైఎస్సార్‌సీపీ నాయకులకు రేపు సన్మానం

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ నియోజవర్గ నాయకులు రాష్ట్ర, జిల్లాస్థాయి, నియోజకవర్గస్థాయి పదవులు లభించడంపై ఆ పార్టీ సమన్వయకర్త టీఎన్ దీపిక హర్షం ఒక ప్రకటనలో వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి ప్రాధాన్యత కల్పించారని, ఇందులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారం మరువలేనిదన్నారు. పదవులు పొందిన వారిని శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ప్రత్యేకంగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. పదవులు పొందిన వారంతా కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని కోరారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు రమేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పెండింగ్ జీతాలు చెల్లించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం టౌన్: గొల్లపల్లి రిజర్వాయర్ వాటర్ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు నెలల నుంచి గొల్లపల్లి రిజర్వాయర్ వాటర్ వర్కర్స్‌కు జీతాలు లేక పస్తులు ఉంటున్నారన్నారు. అలాగే ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జీతాలు చెల్లించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి మారుతీరెడ్డి, గొల్లపల్లి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమేష్, హరి, ఓబులేషు, మంజు, లక్ష్మణ్, ఉమేష్, చంద్రశేఖర్, లోకేష్, రాజశేఖర్‌రెడ్డి, తబ్జుల్ బాషా, బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పశు వైద్యురాలు

సోమందేపల్లి: మండల పశు సంవర్ధకశాఖ వైద్యురాలు హేమలత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న వైద్యుడు బాలాజీనాయక్ కొడిగెనహళ్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ మండలంలో పశుసంరక్షణతో పాటు వైద్యసేవలు సకాలంలో అందించి పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. బదిలీ వైద్యుడు బాలాజీ నాయక్‌కు సిబ్బంది వీడ్కోలు పలికారు.

తహసీల్దార్‌గా నటరాజ్ బాధ్యతలు

చిలమత్తూరు: మండల తహసీల్దార్‌గా నటరాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు నేరుగా తనను కలిసి తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

రొళ్ల: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న జయమ్మ అనే మహిళకు సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు చెక్కు రూపంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు బుధవారం అందజేశారు. ఆరోగ్య సమస్యతో జయమ్మకు ఆస్పత్రిలో రూ.లక్షలాది రుపాయిలు ఖర్చు అయినట్లు ఆమె కుమారుడు పట్టాభిరాము తెలిపారు. సీఎం సహాయ నిధి డబ్బులు అందడం హర్షణీయన్నారు.

తల్లికి వందనం అమలు చేయండి

చిలమత్తూరు: తల్లికి వందనం తమకూ వర్తింపచేయాలని కోరుతూ మండల కేంద్రం సమీపంలోని టేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం తహసీల్దార్ నటరాజ్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు ప్రభుత్వానికి తమ అభ్యర్థన నివేదించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



చాంద్‌బాషాను పరామర్శిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి బుధవారం చాంద్‌బాషా ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిపై ఆరా తీసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఏ శివ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫుల్లా, నాయకులు సల్మాన్, నాహీద్ తదితరులు పాల్గొన్నారు.

21న మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈనెల 21న సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి తెలిపారు. సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజుతో పాటు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, మండలాధికారులు హాజరుకావాలని కోరారు.

దారిని కమ్మేసిన ముళ్లపొదలు



పీఎస్ పాళ్యం గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు



గుడిబండ నుంచి మద్దనకుంట వెళ్లే దారి ఇలా..

గుడిబండ: మండలంలోని అనేక గ్రామాల్లో ప్రధాన రహదారులను ముళ్ల కంప చెట్లు కమ్మేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి పీఎస్ పాళ్యం, కురుబరపల్లి, గుడిబండ, మద్దనకుంట, ముత్తుకూరు గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా ముళ్లకంప పెరగడంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సానిపల్లి సూర్యనారాయణ తండ్రి కుళ్లాయప్ప అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర మునిమగుడుకు చేరుకొని కుళ్లాయప్ప మృతదేహంతో పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మల్లిరెడ్డి, మజ్జిగ నాగరాజు, కుట్టిమద్ది శేఖర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.